క్లుప్తంగా

ఈ క్రాప్ చేయించుకోవాలి

గన్నవరం రూరల్: రబీలో పంటలు సాగుచేస్తున్న రైతులందరూ తప్పక ఈ క్రాప్ చేయించుకోవాలని గన్నవరం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎం.సునీల్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ సాగు పంట ఏదైనా రైతులందరూ వీఏఏలు రైతులను సంప్రదించి ఈ క్రాప్ చేసుకోవాలన్నారు. ఈ క్రాప్ నమోదు చేసుకుంటే ఉచిత పంటల బీమా, పంట నష్ట పరిహారం వంటి ప్రయోజనాలు రైతులకు అందుతాయన్నారు.

అత్తింటివారిపై కేసు

పెనమలూరు: ఆస్తి తగదా కారణంగా అత్తింటివారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి పెనమలూరు సెంటర్‌కు చెందిన దొడ్డపనేని లక్ష్మీప్రసన్నకు కొన్నేళ్ల క్రితం వివాహమైంది. ఆమెకు ఇద్దరు పిల్లలు. ఆమె భర్త శ్రీనివాసరావు రెండేళ్ల క్రితం మృతి చెందాడు. ఆస్తి విషయమై అత్త బేబీ సరోజిని, మరిది రమేష్‌కుమార్ బెదిరించి దౌర్జన్యం చేసి దాడి చేయటంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వేర్వేరు చోట్ల కోడిపందేల నిర్వాహకులపై కేసులు

పెనమలూరు: వేర్వేరు చోట్ల కోడి పందేలు నిర్వహిస్తున్న నలుగురిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి సుగాలీకాలనీకి చెందిన భుక్యా దశరథ, దరావత్ రమేష్, బాణావత్ వెంకటేశ్వరరావు, తాడిగడప రామానగర్‌కు చెందిన కాటూరి గణపతి వారి ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహిస్తుండటంతో కేసు నమోదు చేశారు.

17 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

పెనమలూరు: పేకాడుతున్న 17 మందిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు డొంకరోడ్డులో పేకాడుతున్నారనే సమాచారంతో పోలీసులు శిబిరంపై దాడి చేశారు. పేకాడుతున్న 17 మంది పట్టుబడ్డారు. వారి నుంచి రూ.64,040 సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

బీసీ సంఘ రాష్ట్ర కార్యదర్శిగా నరేష్

పెనమలూరు: బీసీ సంఘ రాష్ట్ర కార్యదర్శిగా యనమలకుదురు గ్రామానికి చెందిన కోసూరి నరేష్ కుమార్‌ను నియమించారు. ఈ మేరకు గురువారం బీసీ సంఘ జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య నియామక పత్రాన్ని నరేష్ కుమార్‌కు విజయవాడలో అందజేశారు. నరేష్ కుమార్ బీసీల అభివృద్ధికి, ఐక్యతకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మారేష్, ఉపాధ్యక్షుడు ఆకునూరు సుబ్బారావు, బీసీ నేతలు ముచ్చు నాగేంద్రబాబు, మోర్ల మహిధర్, ఇంటూరి మురళీకృష్ణ పలువురు పాల్గొన్నారు.

నానో యూరియాతో లాభాలు



ఉయ్యూరు: నానో యూరియా వాడకంతో రైతులకు లాభమని ఇఫ్కో జీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద ఓగిరాలలో గురువారం రైతు సదస్సు నిర్వహించారు. జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ నానో యూరియా వాడకంతో కాలుష్యాన్ని తగ్గించి మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. సాధారణ యూరియాతో పోలిస్తే రూ.225 తక్కువకే ఇఫ్కో అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, జిల్లా ప్రతినిధి నంద కిషోర్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్ము లక్ష్మారెడ్డి, సీఈఓ మధుకుమార్‌రెడ్డి, సర్పంచ్ త్రిపురం లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

170 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: విదేశాల్లో స్థిరపడినప్పటికీ జన్మభూమిపై మమకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రవాసాంధ్రులు అభినందనీయులని వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు అన్నారు. బాపులపాడు మండలం వేలేరులో ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఆర్థికసాయంతో గురువారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. గ్రామంలోని ఎస్టీ తండా కూడలి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన హనుమాన్‌జంక్షన్ సీఐ అల్లు నవీన్ నరసింహామూర్తి చేతుల మీదుగా 170 మంది వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ దోనవల్లి సూరిబాబు, సర్పంచ్ సాదిమెళ్ల సుందరమ్మ, ఎంపీటీసీ సభ్యుడు మురుదుడ్డి యోహాన్ పాల్గొన్నారు.

సృజనకు పదును పెట్టాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు తమలోని సృజనాత్మకతను పదును పెట్టి నూతన ఆవిష్కరణలకు చొరవ చూపాలని కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనుకుంట్ల శ్రీనివాసు అన్నారు. ఆ కళాశాల కామర్స్ అండ్ మేనేజిమెంట్ విభాగం ఆధ్వర్యంలో స్టార్టప్ బిజినెస్ ఐడియా ఎక్స్‌పోను గురువారం ఆ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. కళాశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తిరునాళ్లకు ముస్తాబు

• నేటి నుంచి పేరంటాలమ్మ తిరునాళ్ల • 13 నుంచి 18 వరకు సంబరాలు



విద్యుత్ కాంతులతో ముస్తాబైన పేరంటాలమ్మ ఆలయం

రామవరప్పాడు: సంక్రాంతి సంబరాలకు శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ ఆలయం ముస్తాబైంది. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో సంక్రాంతి తిరునాళ్ల అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ.

అన్ని శాఖల సమన్వయంతో..

కోవిడ్ నిబంధనలు ఆచరిస్తూ ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లను ఆలయ అధికారులు పూర్తి చేశారు. పక్క రాష్ట్రాల నుంచి ఉత్సవాలకు హాజరయ్యే భక్తులను దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లు, మొక్కుబడులు, తాగునీరు వంటి సౌకర్యాలను కల్పించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గ్రామంలో పోలీస్ అవుట్‌పోస్టు, అత్యావసర వైద్య శిబిరాలు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయం మొత్తం విద్యుత్ దీపాలు, అలంకరణతో ముస్తాబు చేశారు.

ఈ నెల 13న ఉత్సవాలు ప్రారంభమై 18 వరకు నిరాటంకంగా జరగనున్నాయి. గ్రామంలో తిరునాళ్ల సందర్భంగా వినోదాన్ని పంచే జెయింట్ వీల్, కొలంబస్, ఆట వస్తువుల దుకాణాలు ఏర్పాటయ్యాయి.

ఉత్సవాల నిర్వహణ క్రమం ఇదీ..

13న భోగి సందర్భంగా ఉదయం 5గంటల నుంచి ఆలయ దర్శనం, వాహన పూజలు, మొక్కుబడులు కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. 14 మకర సంక్రాంతిన విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనము, కుంకుమ పూజలతో కార్యక్రమాలను నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం ప్రారంభమవుతుంది. ఐదు రోజుల పాటు రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల్లో అమ్మవారి గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుంది. 18న ఆలయ సమీపంలోని రైవస్ కాలువలో తెప్పోత్సవం, రాత్రి రావిచెట్టు ఎదుట పూలంగి (ఊయల) సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. 20న ఆలయంలో ఉత్సవాల ముగింపు సందర్భంగా భారీ అన్నసంతర్పణ కార్యక్రమం జరుగుతుంది.

వాహన పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు

ఆలయం జాతీయ రహదారికి ఆనుకుని ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహన పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ సమీపంలో జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో ఆనుకుని ఉన్న ప్రాంతంలో చదును చేసి అమ్మవారి ప్రతిమలతో పూజా మందిరం ఏర్పాటు చేశారు. వాహన పూజలకు వచ్చే వాహనాలకు ఇక్కడ పూజలు చేసి ప్రసాదాలు అందజేస్తారు. అనంతరం పూజలు జరుపుకున్న వాహనాలు ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించకుండా జాతీయరహదారిపై వెళ్లే విధంగా ఏర్పాట్లు చేశారు.



గర్భగుడిలో ముగ్గురమ్మలు



ఆలయంలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు

ఆనవాయితీ ప్రకారమే..



సంక్రాంతి ఉత్సవాలను ఈ సంవత్సరం కూడా ఆనవాయితీ ప్రకారం అంగరంగ వైభవంగా నిర్వహిస్తాం. అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేశాం. తాగునీటి సౌకర్యం, క్యూలైన్లు, ప్రసాదాల వితరణ ఏర్పాట్లు వంటి మౌలిక సదుపాయాలను పూర్తి చేశాం. ఐదు రోజుల పాటు గ్రామోత్సవం విజయవంతం అయ్యేందుకు ఇరు గ్రామ ప్రజలు, భక్తులు సహకరించాలని కోరుతున్నాం. ముగింపు సందర్భంగా ఈనెల 20న ఏర్పాటు చేసే భారీ అన్నసంతర్పణకు దాతలు సహకారం అందిస్తున్నారు. –బోయిన భాను ప్రదీప్, ఆలయ చైర్మన్



గంగూరులో వెల్‌నెస్ సెంటర్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: సంక్షేమ పథకాలు పొందే హక్కు ప్రజలకు ఉందని, గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. గంగూరులో గురువారం రూ 1.16 కోట్లతో నిర్మించిన సచివాలయ భవనం, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రోడ్లు, వాటర్ పైప్‌లైన్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ గ్రామాల్లో సంక్షేమ పథకాలు అమలుకావడంతో పేద కుటుంబాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. టీడీపీ నేతలు దృష్టి లోపంతో ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని ఆరోపించారు. రోడ్లు వేయడమే అభివృద్ధి కాదని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తేనే అభ్యున్నతి అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వందల కోట్లు ఖర్చుచేసి సచివాలయాల భవనాలు, రైతుభరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, పాఠశాలల భవనాలు ,ఇలా అనేక రంగాలను అభివృద్ధి చేస్తే టీడీపీ నేతల కళ్లకు కనబడటం లేదా అని ప్రశ్నించారు.

చంద్రబాబు హయాంలో పారిశ్రామిక వేత్తలకు వందల ఎకరాలు ధారాదత్తం చేశాడని, పేదలకు మాత్రం గజం స్థలం ఇవ్వలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం 30 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చి గూడు కల్పించిందని వివరించారు. డ్వాక్రా మహిళలకు రుణాలు మాఫీ చేశామని, చంద్రబాబులా మోసం చేయలేదని అన్నారు.

గంగూరుకు మహర్దశ..

వైఎస్సార్ ప్రభుత్వ పాలనలో గంగూరు గ్రామానికి మహర్దశ వచ్చిందన్నారు. గడిచిన మూడున్నర సంవత్సరాల్లో రూ.44 కోట్ల సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. రూ 3 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. షాదీఖానా, శ్మశాన వాటికల అభివృద్ధి, ఎస్సీ కమ్యూనిటీ హాల్ ఇలా అనేక అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామన్నారు. నియోజకవర్గంలో రూ.1590 కోట్లు నేరుగా పేద ప్రజలకు అందాయని వివరించారు. కార్యక్రమంలో సర్పంచి తస్లీము న్నీసా, ఇతర గ్రామాల సర్పంచిలు కాకర్ల వెంకటరత్నం, లింగాల భాస్కరరావు, సంగెపు శ్రీనివాసరావు, టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, నేతలు అక్బర్‌పాషా, అజీజుల్లాఖాన్, కె.శ్రీనివాసరావు, హుమాయున్, ఎస్.దేవమణి, సీహెచ్ గోపి, ఇస్మాయిల్ షరీఫ్, రహీం, గని, బాషా, సుబ్బారావు, రాజేష్, నాగేంద్ర, రఫీ, అస్మల్‌పాషా, రిజ్వాన్, ఎంపీడీఓ సునీతాశర్మ, తహసీల్దార్ టీవీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చకచకా పనులు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు శరవేగంగా చేస్తున్నామని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఆయన గురువారం పోరంకిలో రూ 27.50 లక్షలతో నిర్మాణం చేసిన రోడ్డును ఆయన ప్రారంభించి ప్రసంగించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు, నేతలు ఈడే గోపాలకృష్ణ, అంకెం రాజేష్, నల్లమోతు జీవన్, బందెల రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

పెనమలూరు: మండలంలో వివిధ చోట్ల గురువారం సంక్రాంతి సంబరాలు చేశారు. పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఫ్రెష్‌మ్యాన్ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో భోగి పళ్లు, భోగి మంటలు, రంగుల ముగ్గులు, బొమ్మల కొలువుతో సంక్రాంతి సందడి చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, అధ్యాపకులు, విద్యార్థులు భోగి మంటలు వెలిగించారు. షామ్‌రాక్ పాఠశాలలో మామిడాకుల తోరణాలు, చెరకు గడలు, గుడిసెలతో గ్రామీణా వాతావరణాన్ని రూపొందించి గాలిపటాలు ఎగుర వేశారు. కరస్పాండెంట్‌లు సుమన్ త్యాగరాజు, మౌనిక, ప్రిన్సిపాల్ భారతిధర్ పాల్గొన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థునులు భోగి మంటలు వేశారు. మెహంది, సంప్రదాయ దుస్తులు ధరించారు. గంగూరు పంచాయతీ కార్యాలయం వద్ద గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

నున్న(విజయవాడరూరల్): మన సంస్కృతి–సంప్రదాయాలు ఎంతో విలువలతో కూడినవని విజయవాడ రూరల్ ఎంపీడీఓ బి.భార్గవి అన్నారు. గురువారం నున్న గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హైస్కూల్లో సచివాలయాల సిబ్బందికి ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి ఇలాంటి పోటీల్లో పాల్గొనప్పుడే ఆనందంగా ఉంటామన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు బొంతు సరోజిని మాట్లాడుతూ గ్రామాల్లో సంక్రాంతి పండుగకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. గ్రామ కార్యదర్శులు జీటీవీ రమణ, వరుణ్, అజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నున్న(విజయవాడ రూరల్): వికాస్ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో విద్యార్థులు సంక్రాంతి సంబరాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. రక రకాల రంగులతో రంగవల్లులను తీర్చిదిద్దారు. హరిదాసులు, గంగిరెద్దులు, సంక్రాంతిని ఆహ్వానిస్తున్న ముగ్గులు ఆకర్షణీయంగా కనిపించాయి. సంప్రదాయ దుస్తులను ధరించి విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కళాశాల వైస్ చైర్మన్ ఎస్.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను మర్చిపోవద్దన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.రమణ, కల్చరల్ క్లబ్ కో ఆర్డినేటర్లు, సభ్యులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: మండలంలోని పెద అవుటపల్లిలో సెయింట్ జార్జ్ హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. పల్లెటూరి వాతావరణం, పాడి పంటలు, ధాన్యం సిరులు ప్రతిబింబించేలా స్కూలు ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. తెలుగు సంప్రదాయాలతో సంస్కృతి అద్దం పట్టే విధంగా సంప్రదాయ దుస్తులు, హరిదాసు వేషధారణలతో సంబరాలు జరిగాయి. చిన్నారులకు భోగిపండ్లు కార్యక్రమం ఉల్లాస వాతావరణంలో జరిగింది. విద్యార్థుల తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల సిస్టర్ ప్రతిమ శ్యామల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గంగూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గంగిరెద్దు విన్యాసాలు



కానూరు షామ్‌రాక్ పాఠశాలలో చిన్నారుల సంప్రదాయ దుస్తులతో సందడి



పెదఅవుటపల్లిలో చిన్నారులపై భోగిపళ్లు పోస్తున్న ప్రిన్సిపాల్ శ్యామల



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీఓ భార్గవి, ఎంపీటీసీ సభ్యురాలు



సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు



వికాస్ కాలేజి లో రంగవల్లులు వేస్తున్న విద్యార్థినిలు

రేపు త్రిశక్తి పీఠంలో విశేష పుష్పార్చన

కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో వేంచేసి ఉన్న శ్రీకాళీమాత, శ్రీమహాలక్ష్మీ, శ్రీమహాసరస్వతి అమ్మవార్లకు శనివారం ఉదయం 10 గంటలకు విశేష పుష్పార్చన నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ కార్యదర్శి కె.జగదీష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు వివిధ పుష్పాలను(బంతిపూలు మినహా) శుక్రవారం రాత్రి 8 గంటల లోపు దేవస్థానంలో సమర్పించి అమ్మవార్ల సేవలో పాల్గొనాలని కోరారు.

వైభవంగా కూడార్పై వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం ధనుర్మాసోత్సవాలలో భాగంగా శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి ఆధ్వర్యాన 1008 లఘు గంగాళాలతో పాయస నివేదన (కూడార్పై) చేశారు. ఈ సందర్భంగా పారాయణ మండలి కన్వీనర్ మండలపర్తి సత్య శ్రీహరి కూడార్పై విశిష్టతను వివరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం చేశారు.

ప్రకటన

నా క్లయింటు యస్.టి.ఆర్. జిల్లా, విజయవాడ, పటమట, గరికపాటివారి వీధి, డోర్ నెం. 40-24-14/2 కాపురస్తురాలయిన **శ్రీమతి యలమంచి వరలక్ష్మీ, భర్త : కనక దుర్గ ప్రసాద్** గార్ల సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది.

నా క్లయింటు ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని కృష్ణాజిల్లా, పోరంకి గ్రామము, పెనమలూరు మండల కాపురస్తులు అయిన **పోతులూరి నాగేశ్వరరావు**, తండ్రి చంద్రయ్య వారి వద్ద నుండి విక్రయ అగ్రిమెంటు ద్వారా కొనుగోలు చేసుకొనియున్నారు. సదరు ఆస్తిని మా క్లయింటు పేర రిజిష్ట్రేషన్ చేయకుండా ది. 22-09-2022వ తేదీన విక్రయ **దస్తావేజు నెం. 11881/2022**, ద్వారా పోతులూరి శ్రీనివాసరావు గారి పేరుతో రిజిష్ట్రేషన్ చేసియున్నారు. సదరు దస్తావేజును కాన్సిలేషన్ చేయమని మరియు మా క్లయింటు పేర రిజిష్ట్రేషన్ చేయమని కోరుతూ మా క్లయింటు విజయవాడ 6వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు **ఓ.యస్. నెం. 268/2022** మరియు 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు క్రెడిటార్ **ఐ.పి. నెం. 100/2022**, పోతులూరి నాగేశ్వరరావు మరియు పోతులూరి శ్రీనివాసరావులపై దావాలు దాఖలు చేసియున్నారు. కావున సదరాస్తిపై ఎవరైనను క్రయ, విక్రయాలు, తాకట్టు, తనఖా, బ్యాంకు లావాదేవీలు జరిపిన యెడల అవి చెల్లనేరవని అటువంటి లావాదేవీలు జరిపిన వారిపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకొనబడును అని తెలియజేయడమైనది.

షెడ్యూలు : కృష్ణాజిల్లా, కంకిపాడు సబ్ రిజిష్ట్రారు వారి యిలాకా, పెనమలూరు మండలం, పోరంకి గ్రామ పంచాయితీ ఏరియాలో చేరినటువంటిన్నీ, పోరంకి గ్రామ రీ. సర్వే నెం. 443/7రు దాఖలా చ.గ. 263.43లలో అవిర్భిష్టపు 50 చ.గ.ల స్థిరాస్తికి హద్దులు : **తూర్పు :** రావిశెట్టి వీరయ్య గారి ఆస్తి, **దక్షిణం :** అక్కి దాసరి దావీదు వగైరా ఆస్తి, **పడమర :** పోతులూరి శ్రీనివాసరావు గారి ఆస్తి, **ఉత్తరం :** అ. 33.0లు వెడల్పు గల పంచాయితీ రోడ్డు.

ఈ నాలుగు హద్దుల మధ్య నిర్మాణము గావించిన పోతులూరి రెసిడెన్సీ బిల్డింగులో 1500 చ.అ.ల గ్రౌండు ఫ్లోరుకు హద్దులు : **తూర్పు :** ఓపెన్ టు స్కై, **దక్షిణం :** ఓపెన్ టు స్కై, **పడమర :** ఓపెన్ టు స్కై, **ఉత్తరం :** కారిడార్ మరియు ఓపెన్ టు స్కై.

ఇట్లు, **మండపాటి బసవారెడ్డి**, న్యాయవాది
డోర్ నెం. 29-28-1/2,
కోవెలమూడి వారి వీధి, సూర్యారావుపేట,
విజయవాడ-520 002.

విజయవాడ
ది. 21-06-2022

అనధికార డంపింగ్ యార్డు తొలగించాలని నిరసన

గన్నవరం: స్థానిక కోనాయి చెరువు వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన అనధికారిక డంపింగ్‌ను గురువారం గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామంలో సేకరించిన చెత్తను అన్‌లోడు చేసేందుకు వచ్చిన గ్రామ పంచాయతీ ట్రాక్టర్లను, రిక్షాలను రోడ్డుపైనే నిలుపుదల చేశారు. రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తకుప్పలకు పొగ పెట్టడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన రెవెన్యూ, పంచాయతీ అధికారులు స్పందించి అనధికార డంపింగ్ యార్డును వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కాసరనేని గోపాలరావు, ఉప సర్పంచి పాలడుగు నాని, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కాసరనేని రంగాబాబు మాట్లాడుతూ ..గతంలో జిల్లా కలెక్టర్ డంపింగ్ యార్డు కోసం గొల్లనపల్లి శివారులో ఆర్ఎస్. నెం .88లో స్థలం కేటాయించారని చెప్పారు. రెవెన్యూ అధికారులు సదరు స్థలాన్ని మార్కింగ్ చేసి అప్పగించడంలో జాప్యం చేయడం సరికాదన్నారు. దీని వల్ల కోనాయి చెరువు వద్ద చెత్త నిల్వలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. చెత్తకుప్పలకు పంచాయతీ సిబ్బంది నిప్పు పెడుతుండటంతో పొగ కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామస్తుల ఆందోళనతో తహసీల్దారు సీహెచ్. నరసింహారావు, ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, సర్పంచి నిడమర్తి సౌజన్య, పంచాయతీ కార్యదర్శి బాపూజీ గ్రామస్తులతో చర్చించారు. అనంతరం తహసీల్దారు, ఎంపీడీవో డంపింగ్ యార్డు కోసం స్థలాన్ని గుర్తించేందుకు గొల్లనపల్లి శివారులో కొండ పోరంబోకు భూములను పరిశీలించారు.



అనధికార డంపింగ్ యార్డు వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ఘనంగా ముగిసిన నవదిన ప్రార్థనలు

ఉంగుటూరు: పెద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్ తంబి 78వ వర్ధంతి మహోత్సవాల్లో భాగంగా కొనసాగుతున్న నవదిన ప్రార్థనలు గురువారంతో ముగిశాయి. విజయవాడ అజిత్ సింగ్ నగర్ విచారణ కర్త గెద్దం జోజి దివ్య పూజాబలిని సమర్పించి, క్రీస్తును అనుసరించడంలో తంబి సమాత్మక అను అంశంపై బోధించారు. తంబి క్రీస్తు బోధనలకు తన జీవితాన్ని సమర్పించుకున్నారని అన్నారు. క్రీస్తును అనుసరించాలంటే విశ్వాసం, నమ్మకం, వినయం, విధేయత అను సుగుణాలు ఉండాలని చెప్పారు. తంబి మధ్యస్థ ప్రార్థన కోరువారి కోసం ప్రత్యేకంగా ప్రార్థన చేశారు. తంబి పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ సుధాకర్ లారెన్స్, విచారణ ఫాదర్ మరియన్న, ఫాదర్లు మరియదాసు, ప్రవీణ్, సిస్టర్లు, సంఘస్తులు పాల్గొన్నారు.



ప్రార్థన చేస్తున్న ఫాదర్లు

ఎమ్మెల్యే వంశీ చొరవతో పూడికతీత

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక స్టేట్ బ్యాంకు వీధిలో బాపులపాడు పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు గురువారం డ్రెయినేజీ పూడికతీత నిర్వహించారు. ఈ ప్రాంతంలో రెండ్రోజుల కిందట గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించిన గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ దృష్టికి స్థానికులు డ్రెయినేజీ సమస్యను వివరించారు. మురుగునీరు పారుదల లేకపోవటంతో దుర్వాసన, దోమల బెడద, అనారోగ్యాలతో బాధపడుతున్నామని ఎమ్మెల్యే వంశీ వద్ద వాపోయారు. దీంతో ఆయన గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌కు తక్షణం పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని ఆదేశించారు. దీంతో కార్యదర్శి ప్రసాద్ ఆయన సిబ్బందితో కలిసి గురువారం స్టేట్ బ్యాంక్ వీధిలో పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి



పెనమలూరు: స్వామి వివేకానంద జయంతి గురువారం ఘనంగా జరిగింది. కానూరులో మాతృహృదయ్ స్వచ్ఛంద్ సేవా సంఘ్ ఆధ్వర్యాన జాతీయ యువజన దినోత్సవం చేశారు. తొలుత స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సంస్థ నిర్వాహకుడు తాళ్లూరి అశోక్, బాడీ బిల్డింగ్ క్రీడాకారులు సంస్థ సభ్యులు, యువత పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: జీవితాంతం తన బోధనలతో యువతరాన్ని జాగృతం చేసిన గొప్ప మహనీయుడు స్వామి వివేకానంద అని పలువురు కొనియాడారు. హనుమాన్‌జంక్షన్‌లో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. విజయవాడరోడ్డులోని ఫౌండేషన్ కార్యాలయం వద్ద వివేకానంద చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ యదురువాడ శ్రీనివాసరావు, ధర్మ ప్రచారక్ యడవల్లి పాండురంగారావు, అడ్వకేట్ లింగంనేని రాజారావు, విశ్రాంత ఉపాధ్యాయుడు నరహరిశెట్టి బాబురావు, సభ్యులు దావులూరి శ్రీహరి, బేతపూడి సుబ్బారావు, తుమ్మల వంశీ, పిచ్చేశ్వరరావు, రంగారావు పాల్గొన్నారు.